పేద ప్రజలకు రక్ష.. జగనన్న ఆరోగ్య సురక్ష

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి
అంబటి రాంబాబు

రాజుపాలెం: పేద ప్రజలకు ఉపయోగపడే మహోత్తరమైన కార్యక్రమం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మండలంలోని మొక్కపాడు గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి అంబటి రాంబాబు.. మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డితో శిబిరంలో పాల్గొన్నారు. మందులను, డాక్టర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో కూలి చేసుకునే వారు పట్టణాలకు వెళ్లి వైద్యం చేయించుకోలేరనే విషయాన్ని సీఎం వైఎస్ జగన్ గుర్తించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు మంత్రి అంబటి తెలిపారు. పేదవాడికి రోగం వస్తే వెంటపడి వైద్యం చేయిస్తున్నది ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనన్నారు. మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఒక అడుగు ముందుకేసి పేదవాడికి రూపాయి ఖర్చులేకుండా ఆరోగ్యశ్రీ పథకం ,108, 104 సేవలు ప్రవేశ పెట్టారని, అదే దృష్టితో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండడుగులు ముందుకేసి పేదవాడి ఆరోగ్య కోసం తపనపడుతున్నారని అన్నారు. అనంతరం 20 మందికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. గర్భిణులకు పౌష్టికాహార కిట్లు అందించారు. శిబిరంలో 340 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 150 మందికి బీపీ, షుగర పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు పక్కాల సూరిబాబు, మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి చంద్రమౌళి, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీత, మార్కెట్ యార్డు చైర్మన్ కొండ్రెడ్డి సుజాత, ఎంపీటీసీ బెల్లంకొండ బీబీ హుస్సేన్, కో–ఆప్షన్ మెంబరు సుభాని, మాజీ సర్పంచ్ పయ్యావుల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


మొక్కపాడులో గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

538 రోగులకు వైద్య పరీక్షలు

బయ్యవరం(క్రోసూరు): మండలంలోని బయ్యవరం గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 538 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు అందజేశారు. ప్రత్యేక వైద్య నిపుణులు మాధవిలత, డాక్టర్ రమాదేవీ, డాక్టర్ బాలఅంకమ్మ బాయి, డాక్టర్ సిరిచందన, డాక్టర్ సాద్ వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ పి.శివరామయ్య,ఎంపీపీ.పి.కోటయ్య, జెడ్పీటీసీ షేక్ జమీలా గఫూర్ పాల్గొన్నారు.

చాగల్లులో మంత్రి పరిశీలన

నకరికల్లు: మండలంలోని చాగల్లు గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 310 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డితో కలిసి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి షుగర్ పరీక్ష చేయించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, ఈఓపీఆర్డీ గిరిధర్, డాక్టర్ వి.శ్రీనునాయక్, డాక్టర్ సీహెచ్. వెంకటేశ్వర్లు, డాక్టర్ నాగమణి, డాక్టర్ ఎం.చంద్రబాబు, డాక్టర్ అభినవ పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి అపూర్వ స్పందన

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల–1 గ్రామ పంచాయతీ పరిధిలో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. 902 మందికి వైద్య సేవలందించినట్లు పీహెచ్‌సీ వైద్యులు పి.రమాదేవి తెలిపారు. సాధారణ వైద్య పరీక్షలతో పాటుగా, కంటి, రక్త, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను అందించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం స్టాల్‌ను ఏర్పాటు చేశారు. శిబిరంలో వైద్యులు త్రివేణి, స్పందన, ప్రసన్నకుమార్ పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ శింగంశెట్టి కోటేశ్వరమ్మ, తహసీల్దారు ఎం.భవానిశంకర్, ఎంపీడీవో పి.పుట్టారెడ్డి, ఉప సర్పంచ్ సైదా, ఎంపీటీసీ గోగుల అంజిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు కానాల పుల్లారెడ్డి, చిమటా శ్రీనివాసరావు, ఇందూరి వెంకటరెడ్డి, శిరిగిరి గోపాలరావు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్యం

సత్తెనపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ఇంటివద్దకే వైద్యం అందుతోందని వ్యవసాయ సలహా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. కొమెరపూడి గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ప్రజల ఆరోగ్య భద్రతకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అత్యధిక ప్రాధాన్యమిస్తున్నారని ఆయన అన్నారు. వైద్యులు డాక్టర్ ఎస్‌వీఎస్. సాయి తేజ రెడ్డి, డాక్టర్ యు. శ్రీలక్ష్మి కవిత, డాక్టర్ నాగబాబు, డాక్టర్ కాశీ విశ్వనాథం 573 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 8 మందిని మెరుగైన వైద్యం కోసం ఉన్నత ఆసుపత్రులకు రిఫర్ చేశారు. ల్యాబ్ పరీక్షలు 795 మందికి, అప్తామాలజిస్ట్ డాక్టర్ కాశి నేత్ర పరీక్షలు 137 మందికి నిర్వహించారు. 102 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. నేత్రాలకు మెరుగైన వైద్యం కోసం కాటరాక్ట్ పరీక్షలు నిమిత్తం ఏడుగురిని రిఫర్ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో న్యూట్రీషన్ స్టాల్ ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ షేక్ ఎలవర్తిపాటి జైబూన్‌బీ, జెడ్పీటీసీ సంకటి నాగేశ్వరమ్మ, ఎంపీటీసీ సంకటి మహేంద్ర, ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, తహసీల్దారుర్ ఎస్.సురేష్, ఈవోపీఆర్‌డీ దయాసాగర్, హెల్త్ ఎడ్యుకేషన్ సెక్రటరీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

అచ్చంపేట: మండలంలోని కొత్తపల్లిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యశిబిరంలో 327మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరుగురిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ పరిధిలోని వైద్యశాలకు రిఫర్ చేశారు. 11మంది బాలింతలు, గర్భిణులకు మెడికల్ కిట్స్ పంపిణీ చేశారు. 8 మంది చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 103మందికి కంటి పరీక్షలు నిర్వహించి 43మందిని కళ్లజోళ్లకు ఎంపిక చేశారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఎం.ఇన్నారావు, డాక్టర్ రాంబాబు, స్పెషలిస్ట్ వైద్యులు డాక్టర్ ఎస్.ప్రేమ, డాక్టర్ ఎస్.గిరిరాజు రోగులకు పరీక్షలు నిర్వహించినవారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, ఎంపీడీవో పి.శివసుబ్రహ్మణ్యం, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణా నాయక్, సర్పంచ్ ఐతంరాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, సచివాలయాల కన్వీనర్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.


బయ్యవరంలో వైద్యశిబిరంలో పరీక్షలు వైద్యులు


మాదలలో వృద్ధురాలికి కిట్టు అందిస్తున్న ప్రజా ప్రతినిధులు


కొత్తపల్లిలో మెడికల్ కిట్ అందజేత


కొమెరపూడిలో వైద్య పరీక్షలు

క్లుప్తంగా

మానసిక దివ్యాంగులకు బంగారు'భవిత'



సత్తెనపల్లి: మానసిక దివ్యాంగుల ఉజ్వల భవిష్యత్తుకు భవిత కేంద్రాలు బంగారు బాట వేస్తున్నాయని ప్యానల్ న్యాయవాది డి. శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ మానసిక దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ డి.నాగ వెంకటలక్ష్మి సూచనల మేరకు పట్టణంలోని వెంగళరెడ్డి నగర్‌లో ఉన్న భవిత కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. అక్కడ అందుతున్న సేవలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో భవిత కేంద్రం ఇన్‌చార్జి కె.విజయకుమారి, పారా లీగల్ వలంటీర్ షేక్ ముబారక్, హెచ్‌ఎం కె.రిబ్కా, ఉపాధ్యాయురాలు పి. శివజ్యోతి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు మాదల విద్యార్థులు



ముప్పాళ్ళ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన అండర్–19 సెపక్ త్రా, బాల్ బాడ్మింటన్ విభాగాల్లో మాదలలోని ఎంజేపీ ఏపీబీసీడబ్ల్యూఆర్ పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనపరిచారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ మిరియాల వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. అండర్–19 సెపక్‌త్రా విభాగంలో విద్యార్థిని ఎం.అనూష, అలాగే బాల్ బాడ్మింటన్‌లో బి.భాగ్యలక్ష్మి, ఎం.అమూల్య పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. అండర్–17 సెపక్ త్రా విభాగంలో ఎ.చంద్ర మానస, ఎస్.సునీత, ఎన్.వెంకట రవళి, ఎ.అభిలాషిక కూడా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు.

విద్యార్థులకు అభినందన



సత్తెనపల్లి: క్రీడలతో విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని లక్కరాజుగార్లపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి.శారద అన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి యోగా పోటీల్లో పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థి ఎం.ఈశ్వర్ ఐదో స్థానాన్ని సాధించాడు. అలాగే జిల్లాస్థాయి ఖోఖో జట్టుకు విద్యార్థులు టి.తిరుపల్లవి, జె.చిన్నయ్య, లాంగ్ జంప్‌లో ఎన్‌కే రాఘవేంద్ర ప్రథమ స్థానం, 600 మీటర్లలో సీహెచ్ వజ్రమ్మ నిలిచినట్లు తెలిపారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. పీడీ టి.రాజేశ్వరి, ఉపాధ్యాయుడు బీసీహెచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గో-సంరక్షణ శాలకు రూ.10,01,116 విరాళం



సత్తెనపల్లి: ట్రాన్స్‌కోలో ఏఈగా బాధ్యతలు నిర్వహిస్తూ ఇటీవల డీఈఈగా పదోన్నతి పొందిన బత్తుల శ్రీనివాసరావు పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి గో–సంరక్షణ శాల అభివృద్ధికి రూ.1,01,116 విరాళాన్ని మంగళవారం అందజేశారు. ఈ సంద్భంగా గోశాల కల్యాణ మండపంలో ఆయనను ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం బాధ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షులు శింగరి మధుసూదనరావు , సెక్రటరి తొమ్మండ్రు సత్యనారాయణ, జాయింట్ సెక్రటరి కొత్తూరి విశ్వేశ్వరరావు, సభ్యులు దేవరశెట్టి రవికుమార్, కాపుగంటి సుమంత్, చిలకల శ్రీనివాసరావు, అన్నంకృష్ణ, కాపుగంటి రత్తయ్య పాల్గొన్నారు.

సెల్‌ఫోను రికవరీ చేశారు!

శావల్యాపురం: సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు సమగ్ర ఆధారాలతో ఫిర్యాదు చేస్తే సత్వరమే న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానమని ఎస్సై తుళ్లూరి తిరుపతి రావు వెల్లడించారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషనులో సెల్‌ఫోన్ రికవరీ చేసి సంబంధిత వ్యక్తికి సదరు సెల్‌ఫోన్ అందజేశారు. నూతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఎక్కువ విలువ చేసే సెల్‌ఫోన్లు ఇటీవల అధిక సంఖ్యలో చోరీకు గురవుతున్నాయన్నారు. సెల్‌ఫోను ఐయంఐ నంబరు ద్వారా పోయిన సెల్‌ఫోను గుర్తిస్తామన్నారు. అనంతరం శావల్యాపురం గ్రామానికి చెందిన సాతులూరి ఆనందరావుకు చెందిన రూ.25 వేలు విలువ చేసే సెల్‌ఫోను రికవరీ చేసి అందజేశామన్నారు.

ఏరియా వైద్యశాలకు రూ.5 లక్షల విలువైన పరికరాలు

సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా వైద్యశాలలో ఆపరేషన్ థియేటర్ ఆధునీకరణలో భాగంగా ఆపరేషన్ థియేటర్ పరికరాల కోసం నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలకు వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ మంగళవారం విన్నవించారు. పరికరాల నివేదికను అందించారు. దీంతో రూ. 5 లక్షలు విలువైన పరికరాలను అందిస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సత్తెనపల్లి ఏరియా వైద్యశాల అభివృద్ధి చెందుతోందని, ఒకప్పుడు కేవలం ఒక గైనకాలజిస్ట్ ఉండటం వల్ల నిరంతరం సేవలు అందడంలో ఇబ్బంది ఉండేదని, ఇప్పుడు ముగ్గురు గైనకాలజిస్టులు నెలకు 150 నుంచి 200 వరకు ప్రసవాలు చేస్తున్నట్లు తెలిపారు. డైరెక్టర్ కొత్త రామకృష్ణ సేవా దృక్పథంతో పనిచేస్తున్నారని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీని రామకృష్ణ సత్కరించారు.


ఎంపీ శ్రీకృష్ణ దేవరాయులను సత్కరిస్తున్న కొత్త రామకృష్ణ

స్కూల్ గేమ్స్‌లో సత్తాచాటిన నార్నెపాడు విద్యార్థులు

నార్నెపాడు(ముప్పాళ్ళ): నార్నెపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) పోటీలలో పాల్గొని ప్రతిభ కనపరిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.రమేష్ మంగళవారం తెలిపారు. కొమెరపూడిలో జరిగిన నియోజకవర్గస్థాయి ఎంపికలకు అండర్–14 విభాగంలో ఖో–ఖోలో బాలురు ఐదుగురు, బాలికలు నలుగురు ఎంపికైనట్లు తెలిపారు. 600 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం , 400 మీటర్లలో రెండవ స్థానం, 200 మీటర్లలో రెండవ స్థానం సాధించినట్లు చెప్పారు. అండర్–17 విభాగంలో ఖో–ఖో లో బాలురు ఐదుగురు, బాలికలు నలుగురు ఎంపికయ్యారని, 200 మీటర్ల పరుగు పందెంలో రెండవ స్థానం సాధించినట్లు వెల్లడించారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. నరసరావుపేటలోని శంకరభారతిపురంలో జరిగిన అండర్–14 ఖోఖో పోటీల్లో ఎం.సుప్రియ, డి.కార్తీక్ రాష్ట్ర స్థాయికి పోటీలకు ఎంపికయ్యారన్నారు.


ప్రతిభ కనపరిచిన విద్యార్థులు


బంగారు ఆభరణాలను వెంటనే తిరిగి ఇవ్వాలి

దొడ్లేరు(క్రోసూరు): తమ బంగారు ఆభరణాలను వెంటనే తిరిగి ఇవ్వాలని, లేకుంటే బ్యాంకును ముట్టడి చేసి, సేవలను స్తంభింప చేస్తామని దొడ్లేరు చైతన్య గోదావరి బ్యాంకు బ్రాంచ్ మేనేజరుకు బంగారం కోల్పోయిన ఖాతాదారులు మంగళవారం హెచ్చరించారు. దొడ్లేరు సీజీజీబీ బ్రాంచ్ బ్యాంకులో తాకట్టుపెట్టి రుణాలు తీసుకున్న రైతుల బంగారం కనబడకుండా పోయిన ఘటన గత రెండు నెలలు క్రితం బయటపడిన విషయం విదితమే. ఖాతదారుల ఆందోళనతో దిగొచ్చిన రీజనల్ మేనేజర్ న్యాయం చేస్తామని హామీ ఇచ్చి 40 రోజులు దాటుతున్నా ఏ సంగతీ తేల్చలేదు. దీంతో బ్యాంకు సమీపంలోని లక్ష్మీ తిరుతమ్మ గుడిలో ఖాతాదారుల కమిటీ సమావేశం నిర్వహించారు. బ్యాంకు నుంచి వెంటనే రెన్యూవల్ చేసుకోవాలని మెసెజ్ లు వస్తున్నాయని వాపోయారు. దీనిపై బ్యాంకు అధికారులను అడగగా ఉన్న బంగారాన్ని రెవిన్యూవల్ చేస్తామని, రెన్యువల్ చేసుకోకపోతే వడ్డీ పెరుగుతుందని చెబుతున్నారని అన్నారు. కనబడకుండా పోయిన బంగారం సంగతి తరువాత చూద్దామని అంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు జి.రవిబాబు మాట్లాడుతూ రీజనల్ మేనేజర స్థాయి అధికారులు హామీ ఇచ్చినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవటం అన్యాయమన్నారు. దీనిపై బ్రాంచ్ మేనేజరు శివశంకర్ నాయక్ స్పందిస్తూ.. ఇప్పటి వరకు సుమారుగా 450 ఖాతాదారులకు సంబంధించి అప్రైజర్ నాగార్జున నుంచి సుమారు రెండున్నర కేజీలు బంగారం పోలీసులు రికవరీ చేసినట్లు తెలిపారు. ఇంకా కొంత రికవరీ చేయాల్సి ఉందన్నారు. 15 రోజుల్లో ఖాతాదారులు బంగారాన్ని అప్పగించాలని ఖాతాదారులు ఆయన స్పష్టం చేశారు. రైతు సంఘం జిల్లా నాయకులు ఆవుల ఆంజనేయులు, తిమ్మిసెట్టి హనుమంతరావు, ఏపూరి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.


బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న ఖాతాదారులు

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ కార్యకర్తల చేరిక

దొడ్లేరు(క్రోసూరు): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదలకు జరుగుతున్న మంచిని చూసి చాలామంది వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. మండలంలోని దొడ్లేరు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. గుంటూరులోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే నంబూరు వారిని కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. పెదకూరపాడులో వైఎస్సార్‌సీపీని మరింత మెజార్టీతో గెలిపించుకుని జగనన్నకు కానుకగా అందించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో సయ్యద్ సైదా, షేక్ మహిబుల్లా, షేక్ షరీఫున్ చిరుమామిళ్ల శ్యాంప్రసాద్, సయ్యద్ మహబూబ్ సుభాని, సయ్యద్ షరీఫ్, గణపవరం టీబీ, షేక్ ముంతాజ్, షేక్ జాన్‌బి, షేక్ కరిమున్, షేక్ హుస్సేన్, బి.గారపాటి ముంతాజ్, షేక్ జాన్‌బి, సయ్యద్ మాహాబీ,షేక్ చాన్‌బీ, నాగేషమ్మ, షేక్ చిన్న ఖాశిం, సైదులు, షేక్‌మస్తాన్‌బి, షేక్ దరియావలి తదితరులున్నారు.


ఎమ్మెల్యే నంబూరు సమక్షంలో పార్టీలో చేరిన దొడ్లేరు టీడీపీ కార్యకర్తలు

నేడు వాహనాలకు బహిరంగ వేలం

అచ్చంపేట: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసులలో పోలీసులు సీజ్ చేసిన వాహనాలను బుధవారం ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం వేయనున్నట్లు అచ్చంపేట ఎస్ఐ సీహెచ్ మణికృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో 13 ద్విచక్ర వాహనాలు, 3 కార్లు, ఒక ఆటో ఉన్నట్లు చెప్పారు. ఆసక్తి కలవారు సంబంధిత శాఖకు చెల్లించాల్సిన ధరావత్తు సొమ్ము చెల్లించి బహిరంగ వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

వాసవీ క్లబ్స్ బెస్ట్ సెక్రటరీగా నాగేశ్వరరావు

సత్తెనపల్లి: వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ లో బెస్ట్ సెక్రెటరీగా వనమా నాగేశ్వరావుకి అవార్డుకు ఎంపికయ్యారు. వినుకొండలోని కేజీఎల్ కన్వెన్షన్‌లో ఈ నెల 8న జరిగిన వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ సమావేశంలో గవర్నర్ విజయలక్ష్మి దంపతుల చేతుల మీదుగా ఈ అవార్డ్ ను ఆయన అందుకున్నారు. వనమా నాగేశ్వరరావును రోటరీ క్లబ్ సభ్యులు మంగళవారం అభినందించారు.

ఓటరు జాబితా అభ్యంతరాలపై సమీక్ష

సత్తెనపల్లి: స్థానిక కార్యాలయంలో ఆర్డీఓ బీఎల్ఎస్ రాజకుమారి మంగళవారం ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్ల రేషన్‌లైజేషన్‌పై సమావేశం నిర్వహించారు. సత్తెనపల్లి నియోజకవర్గంలోని ఏఈఆర్వోలు, అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతి నిధులు పాల్గొన్నారు. ఎస్ఎస్ఆర్–2024లో భాగంగా ప్రీ–రివిజన్ యాక్టివిటీస్, డెత్, డూప్లికేట్ ఓటర్ల తొలగింపు అంశాలు, పోలింగ్ స్టేషన్‌ల రేషన లైజేషన్‌పై సలహాలు, సూచనలను స్వీకరించారు. ఈ సమావేశంలో నియోజక వర్గపరిధిలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, సత్తెనపల్లి, ముప్పాళ్ల మండలాల తహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

నాదెండ్ల: మైనర్ బాలిక అదృశ్యమైన సంఘటనపై పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఎస్సై జె.బలరామి రెడ్డి తెలిపిన వివరాల మేరకు నాదెండ్ల ఎస్సీ కాలనీలో నివాసం ఉండే తండ్రి తన 16 ఏళ్ల కుమార్తె రెండు రోజులుగా కనిపించటం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పదో తరగతి పూర్తి చేసి, రెండురోజుల క్రిందట కాలనీలోని తమ బంధువుల ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిందన్నారు. తిరిగి ఇంటికి రాకపోయేసరికి బంధువుల ఇళ్ళలో వెతికినా ఆచూకీ లభించకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా సెపక్ తక్రా జట్ల ఎంపిక

సత్తెనపల్లి: ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గుడిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్ –14, అండర్ –17 బాల, బాలికల సెపక్ తక్రా జిల్లా జట్ల ఎంపికలు మంగళవారం నిర్వహించారు. ఈ ఎంపికలకు సెలక్షన్ కమిటీ సభ్యులుగా పీఈటీలు లాకు పిచ్చయ్య, బి.అనిల్ దత్త నాయక్ జె. రమణమ్మ కె. సునీత, కె.శశికళ వ్యవహరించారు.

అండర్ –14 బాలుర జట్టు: బి. అనిల్ కుమార్, పి. నవీన్, బి. నాని, ఎం. ప్రభుదాసు, డి. జాన్సన్, స్టాండ్ బైలుగా టి. మనోహర్, కె. సామ్యూల్ రాజులు ఎంపికయ్యారు.

అండర్ –14 బాలికల జట్టు: షేక్ మెహరు న్నీసా, కె. వర్షిత, డి.దివ్య, టి.నాగసాయి మహేశ్వరి, డి.హరిప్రియ ఎంపికయ్యారు.

అండర్ –17 బాలుర జట్టు: బి.నిరీక్షణ బాబు, పి.గోపీచంద్, పి.తేజ,ఎం విజయ ఆనంద్, పి.శౌరి కిరణ్, స్టాండ్‌బైలుగా కె. ప్రేమ రాజు, కె. అశోక్‌లు ఎంపికయ్యారు.

అండర్ –17 బాలికల జట్టు: కె. జ్యోతి, ఎ. చంద్ర మానస, ఎస్. సునీత,ఎ. అభి లాషిక, బి. దుర్గా మహేశ్వరి, స్టాండ్‌బైలుగా ఎన్ వెంకట రవళి, షేక్ సుహానాలు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోకా సోమనాథ్, కె.వెంకట్రావు, వ్యాయామ ఉపాధ్యాయులు సి.హెచ్. సుధారాణి, ఎం. నరసింహారావు, బి.తులసిరామ్ నాయక్ తదితరులు అభినందించారు.


ఎంపికైన బాల, బాలికలతో హెచ్‌ఎంలు, సెలక్షన్ కమిటీ సభ్యులు

నష్టపోయిన రైతులకు నగదు చెక్కులు అందజేత

అచ్చంపేట: భూములను అభివృద్ధికి గంగా కావేరి సిక్సర్ కంపెనీ మండలంలోని పలు గ్రామాలకు చెందిన 188 మంది రైతులకు రూ.36లక్షల ఆర్థిక సాయం అందజేసింది. నగదు చెక్కులను యువజన శ్రామిక రైతు నేస్తం అధ్యక్షుడు తుమ్మా లూర్దు మర్రెడ్డి మంగళవారం రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది తాళ్లచెరువు, కొత్తపల్లి, కోగంటివారిపాలెం గ్రామాలకు చెందిన 188 మంది రైతులు 584 ఎకరాల భూమిలో గంగా కావేరి సిక్సర్ హైబ్రేడ్ రకం పత్తి విత్తనాలు వేసినట్లు చెప్పారు. దిగుబడి లేకపోవడంతో ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దృష్టికి తీసుకెళ్లగా వారు పంటలను పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాస్త్రవేత్తలను గ్రామానికి పంపారన్నారు. ఎమ్మెల్యే ఈ విషయాన్ని అసెంబ్లీలో కూడా ప్రస్తావించినట్లు చెప్పారు. అయితే విత్తనలోపం లేదని కేవలంలో భూమిలో ఉన్నలోపం వల్లనే దిగుబడి తగ్గినట్లు శాస్త్రవేత్తలు నిర్ధారించారు. అయినా రైతులు నష్టపోకూడదని భావించిన సీఎం జగన్‌మోహనరెడ్డి ఆదేశాల మేరకు రైతులకు ఆర్థిక సహాయం చేసేందుకు కంపెనీవారు ఒప్పుకున్నారు. ఆ మేరకు కంపెనీవారు పంపిన మొత్తాన్ని తాళ్లచెరువు, కొత్తపల్లి, కోగంటివారిపాలెం గ్రామాలకు చెందిన 188మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.5,800లు చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తుమ్మా చిన్నపరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, జోజిరెడ్డి, బీసీ నాయకులు ఉప్పుతల గురవయ్య పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న మాజీ సర్పంచ్ చిన్నపరెడ్డి

నాటుసారా విక్రేత అరెస్ట్

అచ్చంపేట: నాటుసారా తయారు చేసి, విక్రయానికి సిద్ధంగా ఉంచిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని నుంచి 5 లీటర్ల కాపుసారా, తయారు చేసేందుకు వినియోగించే ముడి సరకును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సీహెచ్ మణికృష్ణ మంగళవారం తెలిపారు. వివరాల మేరకు.. మండలంలోని రోకటిగుంటవారి పాలెం గ్రామానికి చెందిన గొర్రె నాగేశ్వరరావు కాపుసారా తయారుచేసి, అమ్మకానికి తరలిస్తుండగా తమ సిబ్బందితో దాడిచేసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతని నుంచి 5 లీటర్ల కాపుసారా స్వాధీనం చేసుకుని, తయారీకి వినియోగించే 30 0లీటర్ల బెల్లం ఊటను, మూడు ప్లాస్టిక్ డ్రమ్ములను ధ్వంసం చేసినట్లు చెప్పారు. గొర్రె నాగేశ్వరరావుపై కేసు నమోదు చేసి సత్తెనపల్లి కోర్టులో హాజరు పరచి, రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఎవరైనా కాపుసారా కాచినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముడి సరుకు నల్లబెల్లం, పట్టిక తదితర వస్తువులు కిరాణా వ్యాపారులు అమ్మిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


సారా విక్రయదారునితో ఎస్ఐ మణికృష్ణ

పాఠశాల విద్యార్థిగా జిల్లా పాలనాధికారి

రాజుపాలెం: మండలంలోని కోటనెమలిపురి జెడ్పీ ఉన్నత పాఠశాలను పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్. శివశంకర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 10వ తరగతి విద్యార్థుల మధ్యలో కూర్చుని, ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను విన్నారు. అనంతరం విద్యార్థులను ఆ పాఠంలోని కొన్ని ప్రశ్నలు అడిగి..వారి సామర్థ్యాన్ని పరీక్షించారు. ఇటీవల జరిగిన ఎఫ్ఏ–2 పరీక్ష పత్రాలను, ఉపాధ్యాయుల పాఠ్య ప్రణాళికలను పరిశీలించి, తగు సూచనలు చేశారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు అభివృద్ధి పనులను కలెక్టర్ పరిశీలించారు. ఉపాధ్యాయుల బోధనా విధానంపై సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట డీఈవో శ్యామ్, తహసీల్దారు ఉన్నీసా బేగం, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీత, ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు, ఎంఈఓ మల్లికార్జునశర్మ, హెచ్‌ఎం శైలజ తదితరులు పాల్గొన్నారు.

